నవ్య వీక్లీ – ఉపాధ్యాయుల భాస్కరరావు స్మృతి సాహితి
కథల పోటీలో విశేష బహుమతి పొందిన కథ

# హర్షఋతువు



"**హ**లో, ఆర్డర్ తీసుకోండి మేడమ్. వచ్చే నెల పదవ తారీఖున ఉదయం ఏడు గంటల్నుండి రాత్రి తొమ్మిది గంటల దాకా అవసరం. ఇద్దరు మావయ్యలు అత్తలు, ముగ్గురు బాబాయిలు చిన్నమ్మలు, అయిదుగురు కజిన్స్ భార్యలతో సహా, ఇంకా... ఓ ఇద్దరు తమ్ముళ్ళనీ మరదళ్ళనీ కూడా రాసుకోండి. తోడల్లుడూ ఉండాల్సిందే. లేకపోతే నా భార్య బాధ పడుతుంది. అంచేత ఒక తోడల్లుడూ వదినగారూ, ఒక మరదలూ ఆమె మొగుడ్నీ కూడా కలపండి....."

"కొడుకులూ కోడళ్ళూ, కూతుళ్ళూ అల్లుళ్ళూ వద్దా సార్?"

"వాళ్ళున్నార్లే... పోనీ ఓ పది మంది మనవళ్ళనీ మనవరాళ్ళనీ పంపండి, సందడిగా ఉంటుంది."

"సందర్భం సంతోషమా విషాదమా సార్ ?"

"సంబరం, ఆ రోజున మా 40వ వివాహ వార్షికోత్సవం జరుపుకోబోతున్నాం"

"ఓ గ్రేట్ మీకు ముందుగా మా 'అద్దెకు ఆప్తులు' సంస్థ తరపున వివాహదిన శుభాకాంక్షలు. మీరు చెప్పిన వారంతా మీరు చెప్పిన సమయానికి మీ ఇంట్లో ఉంటారు. మీకు సేవ చేసే భాగ్యం మా కిచ్చినందుకు మీకు ధన్యవాదాలు తెలుపుతున్నాం. శుభదినము"

ఫోన్ పెట్టేనో లేదో శ్రీమతి అంది "పండగ ఊరికే రాదు. బోలెడు పని పెడుతుంది. ఒకసారి ఇంటి వంక చూడండి. గోడల రంగులు వెలిసి పోయాయి. వంట గది కప్పు అంతా మసిబారి ఉంది. కుళాయిల్లోంచి నీళ్ళు చుక్కలు చుక్కలుగా లీక్ అవుతున్నాయి"

"అర్థమైంది. ఇంటికి మేకోవర్ చెయ్యాలంటావ్. ఓకె. చేసేద్దాం"

రిపేర్ అండ్ పెయింటింగ్ ఏజెన్సీకి ఫోన్ చేసి వివరాలు చెప్పాను. ఎస్టిమేషన్‌కి టెక్నీసియన్ని పంపిస్తామన్నారు.

మరి గంటకి టక్ చేసుకుని టై కట్టుకున్న యువకుడు టక టక బూట్ల శబ్దం చేసుకుంటూ వచ్చాడు. అతడి భుజానికి ల్యాప్‌టాప్ బ్యాగ్ వేలాడుతోంది.

"మా ఇంటిని బయట్నుంచీ, లోపల్నుంచీ బాగా పరిశీలనగా చూడు. దీన్ని కొత్తదానిలా చేసెయ్యాలి. బాత్ రూములు సైతం అద్దంలా మెరిసిపోవాలి. ఎక్కడా లీకేజీలూ గీకేజీలూ ఉండకూడదు" అన్నాను.

"భోజనాలన్నీ బయటే ఏర్పాటు చేస్తాం గదా. వీళ్ళు పిచ్చి మొక్కలవీ పీకించి చక్కగా, సుందరంగా చేసేస్తారేమో కనుక్కోండి" అంది శ్రీమతి.

"అన్ని రకాల పనులూ చేస్తాం మేడమ్. గార్డెన్ ట్రిమ్ చేయిస్తాం. పూలమొక్కలు నాటిస్తాం. పచ్చగడ్డి పరిపిస్తాం. ఇంకేం కావాలన్నా చెప్పండి చేసేస్తాం. పనిలో పనిగా హాలులో పెయింటింగ్స్ పెట్టి, కార్నర్ టేబుల్స్ మీద పెద్ద పెద్ద బొమ్మలు, శిల్పాలు అరేంజ్ చేసి రిచ్‌గా..."

"అవొద్దులే గాని, మిగతా వాటికి ఎస్టిమేషన్ ఇవ్వు"

"ఇలా అడుగుతున్నానని ఏమీ అనుకోవద్దు సార్. ఇంత పెద్ద ఇంట్లో మీ ఇద్దరే ఉంటున్నారా?" అతడి గొంతు నిండా ఆశ్చర్యమే!

ముఖాముఖాలు చూసుకున్నాం. మొదటిసారిగా ఇంటిని వృథా చేస్తున్నామేమో అనిపించింది. "నువ్వడిగిందాన్లో పాయింటు ఉంది. ఆలోచిస్తాం" అన్నాను.

అతడు అదోలా చూసి, ల్యాప్‌టాప్‌లో మునిగిపోయి, ఏవేవో లెక్క లేసి, ఒక అంకె చెప్పాడు.

"నాకు బేరమాడటం ఇష్టముండదు. సూటిగా అడుగుతున్నా. ఎంత డిస్కౌంట్ ఇస్తావ్?"

అవకాశం లేదంటూనే ఒక ఆఫర్ ఇచ్చాడు.

"డన్. వచ్చే నెల తొమ్మిదో తారీఖు సాయంత్రానికి అన్ని పనులూ అయిపోవాలి. ఇదిగో అడ్వాన్సు" చెక్కు రాసిచ్చాను.

అతడెళ్ళేక, "ఇక క్యాటరింగ్‌కి ఆర్డరివ్వాలోయ్" శ్రీమతితో అన్నాను.

"మొత్తం ఎంత మంది అవుతారని?"

"మొదట బంధుమిత్రులందరికీ ఇన్విటేషన్స్ పంపుతాను. ఎందరు వచ్చేదీ కన్ఫర్మ్ చేస్తూ రిప్లై ఇమ్మంటాను. దానిని బట్టి బుక్ చేద్దాం"

వెంటనే ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్ అన్నిటి ద్వారా ఆహ్వానాలు పంపేశాను.

అమెరికాలో ఉంటోన్న మా పెద్దబ్బాయి ఫోన్ చేశాడు. "ఇప్పుడర్జంటుగా ధూంధాంగా మ్యారేజ్ డే చేసుకోవడం అవసరమా?"

"అవసరమనే చేస్తున్నాం. మేం ఏం సంపాదించామో జనానికి తెలియాలిగా!"

"ఊరికే దుబారా చేసేస్తున్నారు. మీ పద్ధతేం బావోలేదు. ఎందుకైనా మంచిది, వీలునామా రాసెయ్యండి" గట్టిగా అన్నాడు.

"పాయింటే. బాగానే గుర్తు చేశావు. రాసేస్తాన్లే"

"ఒక ప్లీడర్ని పంపిస్తాను, జాగ్రత్తగా రాసి రిజిస్టర్ చేయించండి. తర్వాత ప్రోబ్లమ్స్ రావు. రాసే ముందు నేను ఇంటికి పెద్ద కొడుకునని, పెద్ద పాలేరులాంటి వాణ్ణని గుర్తు పెట్టుకుని కొంచెం అదనంగా ముట్టజెప్పండి"

"నువ్వు నాకు పాలేరుతనం ఎప్పుడు చేశావురా!"

"పోనీ, మీకు తలకొరివి పెడతానుగా, దాని గురించి ఎక్స్ట్రా ఇవ్వండి" విసుగ్గా అన్నాడు.

"నువ్వు పెట్టావో లేదో, అసలెవరైనా పెట్టారో లేదో నాకు తెలీదు కదరా!"

"మీకు చాదస్తం బాగా ముదిరింది. ఏదో ఒకటనుకుని రాయండి. పెద్ద కొడుకుని. మిమ్మల్ని మొదటగా నాన్నా అని పిలిచింది నేనే. అది గుర్తు పెట్టుకోండి చాలు" ఫోన్

కట్ చేశాడు.

మరి పది నిముషాలకి పెద్దమ్మాయి ఫోన్ చేసింది. "ఇన్విటేషన్ డిజైన్ చాలా బాగుంది నాన్నా. మాకూ రావాలని ఉంది గాని ఆ టైంలో టోర్నాడో ఉందంటున్నారు. ఫ్లైట్స్ క్యాన్సిల్ అవుతాయి..."

"ఏం ఫర్లేదు తల్లీ. చాలా మంది వస్తున్నార్లే"

"వీలునామా రాస్తున్నావా నాన్నా. అన్నయ్య చెప్పాడు. అమ్మకి ఎంతో సాయంగా ఉండేదాన్నని ఎప్పుడూ అంటూ ఉంటావు కదా నాన్నా. అది గుర్తుంచుకో. నీకు అంతా సమానమే గాని నాక్కొంచెం ఎక్కువ ఫేవర్ చెయ్యి. పట్టుబట్టి మరీ నాకు నానమ్మ పేరు పెట్టావు!"

"చూద్దాంలే. ఇంకా ఏమీ అనుకోలేదు"

"ఇప్పుడనుకో నాన్నా. అన్నీ పేపర్ మీద పెట్టేస్తే క్లియర్ కట్‌గా ఉంటుంది. రేపు రాద్ధాంతాలు రావు"

"నేను రాసినా రాయకపోయినా వచ్చేవి వస్తాయిలే తల్లీ, ఉంటాను."

లైన్ కట్ చేశానో లేదో చిన్న కూతుర్నించి ఫోన్ వచ్చింది.

"మీకు పెళ్ళై నలభై ఏళ్ళయ్యాయా? నిజంగా గ్రేట్ డాడీ. అంటే దగ్గర దగ్గర డబ్భై ఏళ్ళొచ్చాయా? నమ్మలేకపోతున్నాను!"

"నాకూ ఆశ్చర్యంగానే వుంది. వ్యాపారమూ, సంపాదనా, మీ చదువులూ, పెంపకమూ, మీ పెళ్లిళ్ళూ, మీకు రెక్కలు రావడమూ.... గబగబా జరిగిపోయాయి. పరుగు ఆపి చూస్తే, నేనూ నా ఎదురుగా మీ అమ్మ, మా ముందు ఖాళీగా ఉన్న ఇల్లూ మిగిలాయి! ఆ గొడవకేం గాని మీరొస్తున్నారా లేదా?"

"వెళ్దామనే పట్టుబట్టాను. ఇంతోటి దానికి పుణె నుంచి అంతదూరం వెళ్ళాలా అంటున్నారు మీ అల్లుడు గారు!"

"మీ ఇష్టం మరి"

"ఫోన్ అమ్మకివ్వండి" అంది. శ్రీమతికి ఇచ్చాను.

"నీకు తెలుసు కదమ్మా. ఆయన వెళ్ళొద్దంటే గడప దాటలేను కదా. రాలేదని ఏమీ అనుకోవద్దు. నాన్నకి నచ్చజెప్పు. అయినా ఈ నెంబర్ల లెక్కలేంట్లే. ఇప్పుడు నలభై, వచ్చే ఏడాదికి నలభై ఒకటి. క్యాలండర్ తో బాటు మారుతూనే వుంటాయి. విశేషం ఏముందీ!"

"ఉందనుకుంటే ఉంది, లేదనుకుంటే లేదు" ముక్తసరిగా అంది శ్రీమతి.

"ఒక్క నిమిషం అమ్మా, ఫోన్ పెట్టేయకు. నాన్నేదో వీలునామా రాస్తున్నాడని...."

"రాస్తే మంచిదనుకుంటున్నారు. నువ్వే అడుగు" ఫోన్ నా చేతికి ఇచ్చింది.

"నీది చాలా మంచి ఆలోచన డాడీ. మనిషీ, మెదడూ బాగుండగానే రాసేస్తే

అందరికీ మంచిది. ఎవరేంటో నీకు ఇప్పుడే కదా తెలిసేది. అన్నయ్య అమెరికాలో, అక్క కెనడాలో, తమ్ముడు జర్మనీలో ఉంటారు. నేనొక్క దాన్నే నీకు దగ్గర్లో పిలిస్తే పలికేంత దూరంలో ఉన్నాను.రేపు జరక్కూడనిది ఏం జరిగినా ముందొచ్చి వాలిపోయేది నేనే"

"ఓహో, ఏమీ జరగలేదనే గత మూడేళ్ళనుంచీ రాలేదా. సరేలే. జరిగాక చూద్దాంలే"

"అంతా అయిపోయాక చూసేదీ చేసేదీ ఏముంటుంది డాడీ. ఏమైనా చెయ్యాలనుకుంటే ఇప్పుడే చెయ్యాలి. నాకు ముగ్గురూ ఆడపిల్లలే. వాళ్ళకి ఘనంగా పెళ్ళిళ్ళు చెయ్యాలి. భారీగా కట్నాలివ్వాలి. తాత ఆస్తి అని వాళ్ళకీ ఆశ ఉంటుంది కదా. అందుకని నీ చిట్టితల్లికి కొంచెం...."

"ఎక్కువివ్వమంటావ్. చూద్దాంలే"

"థ్యాంక్యూ. నువ్వు మాటంటే మాటేనని నాకు తెలుసు డాడీ. బై డాడీ. ఆరోగ్యం జాగ్రత్త. అమ్మకి చెప్పు"

భోంచేద్దామని అన్నీ వడ్డించుకుని కూర్చున్నామో లేదో, చిన్న వాడు వాళ్ళమ్మకి ఫోన్ చేశాడు.

"దీంతో సర్కిల్ పూర్తయినట్టే" నవ్వాను.

శ్రీమతి మాత్రం కంగారు పడుతూ అడిగింది "ఈ టైంలో చేశావేంరా, మీకిప్పుడు అర్ధరాత్రి కదా!"

"చిన్నక్క ఏదో మెస్సేజ్ పెట్టిందిలే..."

"మ్యారేజ్‌డే గురించా, వీలునామా గురించా?"

"రెండిట్ల గురించీనూ. డాడీకి అంతా తొందరే. ఇప్పుడంత భారీగా చేసుకోవాల్సిన అవసరం ఏమొచ్చింది చెప్పు. ఇంకో పదేళ్ళు ఆగితే గోల్డెన్ జూబిలీ అదిరిపోయే లెవెల్లో మేం చేద్దుం కదా!"

"అప్పుడూ చెయ్యండ్రా, ఎవరొద్దన్నారూ!"

"సరే, అప్పుడెంత గ్రాండ్‌గా చేస్తానో మీరే చూస్తారుగా. రోజూ నేను మీరు సుఖసంతోషాలతో ఆరోగ్యఐశ్వర్యాలతో తులతూగుతూ ఉండాలని రోజూ నేను దేవుణ్ణి కోరుకుంటూ ఉంటాను. ఇకపోతే నీకు తెలుసుకదమ్మా. ఇల్లు నీ పేరన ఉంది. నేను చిన్నకొడుకుని. అంచేత..."

"మీ డాడీకి చెబుతాన్లే. ఆయన బుర్రని ఏ పురుగు తొలుస్తోందో మరి. ఇంక పడుకోరా, లేకపోతే ఆరోగ్యం పాడవుతుందిరా"

"అలాగే పడుకుంటానమ్మా. నువ్వు చెబితే నాన్న కాదనరు. భారం నీ మీద వేసి పడుకుంటున్నాను..."

ఫోన్ పక్కన పెడుతూ, "చిన్నవాడి కన్ను ఇంటి మీద పడింది" అంది.

"అంతా విన్నాన్లే"

ఇంటి రిపేర్ పనులు చకచకా జరుగుతున్నాయి.

బంధువులూ మిత్రులూ ఎవరొచ్చేదీ ఎందరొచ్చేదీ జవాబు ఇచ్చారు. అతిథుల సంఖ్యని అంచనా వేసి బ్రేక్ ఫాస్ట్ నుంచి డిన్నర్ దాకా ఆర్డర్ ఇచ్చాను. వినోదానికి టీవీ హాస్య నటుల షో, పాటలు పాడే బృందం, మేజిక్ షోలు బుక్ చేశాను.

ఒక మిత్రుడు రహస్యంగా అడిగాడు "మందుకూడా ఉంటే మజాగా ఉంటుంది గురూ. నువ్వు తాగకపోయినా మాకు పోయించొచ్చుగా!"

"వచ్చుగాని ఆ తర్వాత మీరు తిన్నగా నిలబడలేరు. మిమ్మల్ని నేను కంట్రోలు చెయ్యలేను. ఎందుకులే, వదిలేయ్"

ముఖం మాడ్చుకుని సణుక్కుంటూ వెళ్ళిపోయాడు. అతడు సొంత డబ్బుతో మందు తాగనని భార్యకి ప్రమాణం చేశాడు పాపం!

పక్కింటాయన వచ్చాడు. ఏర్పాట్లు చూసి కళ్ళెగరేశాడు.

"మళ్ళీ పెళ్లి చేసుకుంటున్నట్టు, అబ్బో, భారీగా చేస్తున్నారే"

"ఇదే కాదు, ఇక ముందు ప్రతీ పండగా ఇలా అందర్నీ పిలిచి చేస్తే ఎలా ఉంటుందా అని ఆలోచిస్తున్నాను. మీకు తెలుసుగా, మాకేం బరువులూ బాధ్యతలూ లేవు. బతికినన్నాళ్ళూ హ్యాపీగా బతకడమే మా ఏకైక ఎజెండా. ఎలాంటి ఆంక్షలూ ఒత్తిళ్ళూ మొహమాటాలూ బంధాలూ ఏమీ లేకుండా, వేటినీ పట్టించుకోకుండా, చెయ్యాలనుకున్నదల్లా స్వేచ్ఛగా చేసేస్తాను. ఇన్నేళ్ళూ బోల్డు సంపాదించాను. ఇక చాలు అనుకుని బిజినెస్ అమ్మేశాను. ఇక మిగిలిందల్లా పది మందితో కలిసి ఎంజాయ్ చేయడమే!"

"ఇదేదో పుణ్యకార్యం అయినట్టు మాట్లాడతారేంటీ! ఈ పార్టీలూ గీర్టీలూ ఇహానికీ పనికి రావు, పరానికీ అక్కరకు రావు!"

తుళ్ళిపడి చూశాను. తల తిప్పేసిరికి శ్రీమతి నా వంకే చూస్తోంది!

"ఇలా ఊరికే ఖర్చు చేసేకన్నా ఒక ప్రయోజనం కోసం, పరమార్థం కోసం చేస్తే బావుణ్ణంటావా?" బుర్రలో బుల్లి ఆలోచన నాటుకోగా ఆమెని అడిగాను. అవునంటూ తలాడించింది.

"ఆఁ అలా చెయ్యి, మంచిది" అన్నాడతడు.

"ఆ సంగతి తర్వాత చూద్దాం, ముందిది సక్సెస్ చెయ్యండి. మీరంతా బంధుమిత్ర సపరివార సమేతంగా వచ్చేయండి"

మళ్ళీ అతడే సంశయిస్తూనే స్వరం తగ్గించి అన్నాడు "మీ పెద్దబ్బాయి ఫోన్ చేశాడు. మీరు మతిలోనే ఉన్నారా అని అడగటానికి....!"

బిగ్గరగా నవ్వుతూ శ్రీమతితో అన్నాను "విన్నావుటోయ్, వార్తలు ఎప్పటికప్పుడు

అందరికీ వెళ్ళిపోతున్నాయి. ఇదీ మంచిదేలే! ఇన్నేళ్ళకి మన మీద శ్రద్ధ చూపిస్తున్నారు!"

మరి అరగంటకి పెద్ద కొడుకు ఫోన్ చేశాడు. "సంపాదించిందంతా అడ్డమైన వాటికీ తగలేస్తాను అంటున్నారంట ఏంటి? మీకేమైనా పిచ్చా వెర్రా?"

"తప్పురా అబ్బాయ్. తగలెయ్యట్లా, పదిమందిలో కలిసి అనుభవిస్తున్నాం. అనుభవించడానికేగా రాత్రీ పగలూ కష్టపడి కూడబెట్టిందీ. మేం మాత్రమే తినడంలేదులే, అయిదారువందల మందికి తినిపిస్తున్నాం."

"మీ ఇష్టం వచ్చినట్లు ఖర్చు చేస్తే కాదు. మీ సంపాదన మీద మాకూ హక్కుంది" కఠినంగా అన్నాడు.

"ఉంటే నువ్వూ రారా. ఎంజాయ్ యువర్ సెల్ఫ్!"

వాడు మరి మాట్లాడలేక పోయాడుగాని, చిన్న కూతురు కాల్ చేసి అడిగింది "డబ్బంతా నాశనం చేస్తున్నావంట, మాకు చిల్లి గవ్వ ఇవ్వకూడదని కంకణం కట్టుకున్నావా డాడీ?"

"ఇదంతా నా సంపాదనేగా చిట్టీ. మీకు చెయ్యాల్సినవన్నీ చేసేశాను. మీరు కూడా రెండు చేతుల్తో సంపాదించుకుంటున్నారు. మీ విజయాల్లో నా భాగమూ ఉంది కదాని నేనేం వాటా అడగటం లేదుగా. మీ ఇష్టం వచ్చింది మీరు, నా ఇష్టం వచ్చింది నేను చేసుకునే హక్కు మనకుంది. ఏ మనిషైనా జీవితంలో అసలైన యుద్ధాలు, వయస్సులో ఉన్నప్పుడు కాదు ముసలితనంలో చేయాలి తల్లీ. ఆశయాలతో అనారోగ్యంతో అయినవాళ్ళతో కబ్జాదారులతో – అందరితోనూ!"

"నాకేం అర్థం కావట్లేదు"

"సంధి ప్రేలాపనలా ఉందా? వదిలెయ్" నవ్వాను. కన్నీళ్ళు పెట్టుకుంది.

మరి కాస్సేపటికే చిన్నకొడుకు లైన్లో కొచ్చాడు "మా అవసరం మీకు లేదనుకుంటున్నారా, ఇష్టానుసారం ప్రవర్తిస్తున్నారు?!" అన్నాడు దూకుడుగానే.

"మీతో మాకేం సంబంధం మిగిలిందిరా. మేంఎవరిక్కావాలి! వారానికోసారి ఫోన్లో పలకరించడానికే మీకు తీరికుండదు. ఒకప్పటి వాసనలు వదులు కోలేక అయినవాళ్ళని అద్దెకు తెచ్చుకుంటున్నాం. ఈ మధ్య ఇక్కడ ఈ దందా బావుందిలే. ఎవరు కావాలంటే వాళ్ళు అద్దెకు దొరుకుతారు. ఏమాటకామాటే చెప్పుకోవాలి. అభిమానాలు ఒలకబోస్తూ అచ్చం బంధువుల్లానే ప్రవర్తిస్తార్రా. కావాల్సింది కావాల్సినప్పుడల్లా దొరుకుతోంటే ఇక మీ అవసరం ఏవుందిరా!"

గొలుసుకట్టులోలా ఆ వెంటనే పెద్దమ్మాయి ఫోన్ చేసింది.

"మేమెవరం అక్కర్లేదన్నావంటగా. నీ కెవరో మందు పెట్టారు. మీరిది వరకు ఇలా ఉండే వారు కాదు. మేం నోరు తెరచి అడిగితే చాలు కొండమీద కోతిని కూడా తెచ్చి ఇచ్చేవారు. అమ్మ కూడా మీకు వంత పాడటమే చిత్రంగా ఉంది"

"మీరు ఇది వరకట్లా ఉంటున్నారా! ఆ అభిమానాలు ఆప్యాయతలు అనురాగాలు – ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమ సమూహాలు!" నా గొంతు వణికింది.

"మేమేమీ చిన్న పిల్లలం కాదు. పెద్ద వాళ్ళమయ్యాం. మాకూ పిల్లలున్నారు. మీతో ఊరేగడానికి మాకెక్కడ తీరుతుందీ! మీకీ మధ్య మైండ్ బ్యాలెన్స్ తప్పుతున్నట్టుంది. ఎందుకైనా మంచిది డాక్టరుకి చూపించుకోండి"

"అవసరం లేదు తల్లీ. ఇన్నేళ్ళూ బిడ్డల మోహంలో బతికాం. ఇప్పుడా జాలంలోంచి బయటపడ్డాం. ఎన్నాళ్ళు బతుకుతామో తెలీదు. ఎప్పుడైనా బకెట్ తన్నెయ్యొచ్చు. ఆ తర్వాత ఎవరొచ్చారో, ఎవరు ఏడ్చారో ఎవరిక్కావాలీ! అందుకే రోజూ పండగ చేసుకోవాలనుకుంటున్నాం. పండగంటే పదిమందితో ఆనందం పంచుకోవడమేగా?!"

"పెద్ద తమ్ముడన్నది నిజమే. మీకు బుద్ధి చెప్పాల్సిందే. లేకపోతే బూడిదే మిగులుస్తారు!" ఠక్కున లైన్ కట్ చేసింది.

"వీళ్ళా మన పిల్లలు! వాళ్ళకి చేయాల్సిందంతా చేసేసినా, మనకున్నదంతా పంచేసి పువ్వుల్లో పెట్టి వాళ్ళకి ఇచ్చెయ్యాలట. వాళ్ళకి నచ్చేవీ, ఖర్చు లేనివీ చెయ్యాలి తప్ప మనకి సంతోషం కలిగించే పనులు చేసుకోకూడదట. చిత్రంగా లేదూ?!" శ్రీమతితో అన్నాను.

"లోకం పోకడ అలా వుంది!" వ్యాఖ్యానించింది.

మ్యారేజ్‌డే నాడు ఉదయమే బుక్ చేసిన బంధువులంతా బిలబిలమంటూ వచ్చేశారు.

"నేనురా మీ మావయ్యని. ఎలా ఉండేవాడివి ఎలా అయిపోయావురా!" "ఒరె అబ్బాయ్, అలా తెల్లమొహం వేస్తావేంట్రా. నీ అత్తయ్యని! బాగున్నావ్రా. చూసి చాన్నాళ్ళయ్యిందిరా" "నీ కన్నా పెద్దదాన్ని నా జుట్టింకా నల్లగా నిగనిగలాడుతోంది. నీ జుట్టేవిట్రా ముగ్గుబుట్ట అయ్యిందీ!" "బావగారు అచ్చం కొత్త పెళ్ళికొడుకులా ఉన్నారు!" "మా వదినకి నా దిష్టే తగిలేట్టుంది" "నిన్ను బామ్మగారు అననా మామ్మగారని పిలవనా?" "మీరలా పార్వతీ పరమేశ్వరుల్లా కూర్చోండి అన్నీ చక్కబెట్టడానికి మేమున్నాం కదా!"

ఎన్నో పలకరింపులు! పులకరింతలు! వాళ్ళని కిరాయి బంధువులని ఎవరనగలరు?

తలో పనీ భుజాన వేసుకున్నారు. ఆహుతుల్ని ఆహ్వానిస్తున్నారు. తిండి ఏర్పాట్లు చూస్తున్నారు. వినోద కార్యక్రమాలు పర్యవేక్షిస్తున్నారు.

ఇహ పిల్లల ఆటల్తో పాటల్తో నవ్వుల్తో మా ఇల్లు మార్మోగిపోతోంది!

ఇంటికి పెళ్ళి కళ వచ్చింది. ఇంటి నిండా జనమే. నా చిన్నప్పుడు మా ఇల్లు ఇలానే ఉండేది. పండగలకీ పబ్బాలకీ అయితే తలాటి ఆడబడుచుల్నుంచి అంతా

సకుటుంబంగా వచ్చేసేవారు. ఆ రోజులే వేరు!

కళ్ళల్లోంచి ఆనంద భాష్పాలు జలజల రాలి పడుతోంటే అంది శ్రీమతి "మన పిల్లలంతా మళ్ళీ చిన్నవాళ్ళై మన కళ్ళ ముందు తిరుగుతున్నట్టుగా ఉందండీ!"

"నాకూ అలాగే అన్పిస్తోంది" సాలోచనగా అన్నాను.

"రోజూ ఇల్లు ఇలా కళకళలాడుతూ వుంటే ఎంత ఆనందంగా వుంటుందో కదండీ. అలాంటి దేదైనా కుదుర్తుందేమో చూడండి. మనకీ ఈ ముదిమిలో ఉత్సాహంగా ఆరోగ్యంగా సంతృప్తిగా ఉంటుంది."

"చూద్దాం. బుర్రలో ఏవేవో ఆలోచనలు గింగిర్లు తిరుగుతున్నాయి" అన్నాను.

ఆర్భాటంగా పార్టీ మొదలైంది.

అంతా వచ్చి మమ్మల్ని తీసుకెళ్ళి, స్టేజీ మధ్యలో ప్రత్యేక కుర్చీల్లో కూర్చోబెట్టారు. మమ్మల్ని పొగిడారు. పద్యాలూ పాటలూ పాడారు. మేమిద్దరం ఒకరికొకరం మిఠాయిలు తినిపించుకునే దాకా వదల్లేదు. గోలగోల చేస్తూనే ఉన్నారు.

లంచ్ అవుతూనే సంగీతకార్యక్రమం మొదలైంది.

మరో ప్రక్క అప్పుడే డిన్నర్‌కి వంటలు మొదలు పెట్టేశారు.

'కేక్ కటింగ్ ఎన్నింటికి?' ' డిన్నర్ ఏ టైంకి రెడీ అవ్వాలి' 'ఒరేయ్ వాళ్ళకి టీలు ఇవ్వండ్రా' 'ముందే చెప్తున్నా. కేక్ కట్ చేశాక అంతా కలిసి గ్రూపు డాన్సు చెయ్యాలి' 'అదయ్యాకే పాటగాళ్ళని వెళ్ళనివ్వండి' 'పిల్లలు మ్యాజిక్ ప్రోగ్రాం ఎప్పుడని అడుగుతున్నారు'

అంతా ఒకటే హడావిడిగా ఉంది.

కూడబలుక్కున్నట్టుగా మా ఇద్దరబ్బాయిలూ ఇద్దరమ్మాయిలూ వచ్చేశారు.

"మనబ్బాయిలూ, అమ్మాయిలూ వచ్చారండీ. కేక్ కట్ చేసే సమయానికి తప్పకుండా వస్తారనుకున్నాను. అలాగే వచ్చారు చూడండి. పట్టుబట్టలూ పూలదండలూ తెచ్చి ఉంటారు. ఏమైనా పేగు బంధం పేగు బంధమేనండీ" అంటూ సంబరంగా నన్ను తోసుకుని మరీ ఎదురెళ్ళింది శ్రీమతి.

వాళ్ళు సంకోచిస్తూనే ముఖాలు వేలాడేసుకుని లోపలి కొచ్చారు.

"వెల్కం, పరాయివాళ్ళు పొద్దుటొస్తే, అయిన వాళ్ళు రాత్రికి వచ్చారన్నమాట. ఏమైతేనేం వచ్చారు. అదే సంతోషం. రండి...."

కొందరు వాళ్ళకి జ్యూస్ తెచ్చిచ్చారు. మీరు త్వరగా డ్రెస్ మార్చుకోండని కొందరొచ్చి మా ఇద్దర్నీ తొందరపెట్టారు.

"వీళ్ళెవర్రా?" అద్దె మావయ్య అడిగాడు.

"కొడుకులూ కూతుళ్ళూనూ"

"మా కంపెనీ వాళ్ళా లేక వేరే కంపెనీ వాళ్ళా!"

"ఈ ఇంటి కంపెనీ వాళ్ళేలే గాని, వీళ్ళ స్నానాలకవీ ఏర్పాట్లు చూడమని చెప్పు

మావయ్యా"

"నిజం కొడుకులూ, నిజం కూతుళ్ళూ వచ్చార్రా. వారికేం కావాలో నువ్వూ నువ్వూ దగ్గరుండి చూడండి" ఇంకెవరికో పురమాయించి హడావిడి చేస్తూ వెళ్ళాడతడు.

"వీళ్ళంతా ఎవరు?" పెద్ద కొడుకు ముఖం చిట్లిస్తూ అడిగాడు.

"మన బంధువులే"

"మేమెప్పుడూ చూళ్ళేదు?"

"అద్దె బంధువులు" శ్రీమతి చెప్పింది.

నిరసనగా నవ్వింది పెద్దమ్మాయి.

"ఈ గందరగోళం అంతా ఏంటి డాడీ. ఇదంతా ఎందుకు? ఎవరికోసం?" చిన్నకొడుకు అడిగాడు.

"అన్ని రుతువులూ వెళ్ళిపోయాయి. ఇప్పుడు హర్షఋతువు వచ్చింది. శ్రమ, కష్టం, బాధ, నిరాశ ఇవన్నీ మింగేసిన కాలాన్ని తిరిగి చేజిక్కించుకుని హ్యాపీగా జాలీగా గడిపెయ్యడమే ఇక మా పని. కమాన్. మీరూ కలవండి...." ఉత్సాహంగా అన్నాను.

"వీటికి ఫుల్ స్టాప్ పెట్టించడానికే వచ్చాం" చిన్న కూతురు చెప్పింది.

"ఏం? మేం హ్యాపీగా ఉండటం మీ కిష్టం లేదా?" శ్రీమతి ప్రశ్నించింది.

"ఇదేం పిచ్చి హ్యాపీనెస్? మేమెక్కడా చూడలేదు. ఇంటి మీద పడి ఊరికే మెక్కేస్తూ పొగిడే పొగడ్తలు మీకిప్పుడు కావాల్సొచ్చాయా? అవే ఆనందపరుస్తాయంటే 'మీరింత వారు అంత వారు' అంటూ స్తోత్రనామావళి రికార్డు చేసిస్తాం, రోజుకి మూడుసార్లు వింటూ తరించండి" అన్నాడు పెద్దవాడు.

"కృష్ణా రామా అనుకోండి. తీర్థయాత్రలకు వెళ్ళండి. పుణ్యం పురుషార్థం వస్తాయి. అంతేగాని ఇలా రోడ్డే పోయే వాళ్ళందర్నీ పోగేసి పార్టీలంటూ తగలేస్తే మేం సహించం" పెద్దమ్మాయి నిక్కచ్చిగా చెప్పింది.

"మంచి పాయింటు చెప్పావు తల్లీ. సంతోషం. మా గమ్యం గురించి నాకిప్పుడు క్లారిటీ వచ్చేసింది!"

నా మాటలకు నలుగురూ మిర్రి చూశారు. వారి చూపులు పట్టించుకోకుండా "నువ్వు కోరుకున్న ఆనంద క్షణాలు ఇక మనింట్లో ఘనీభవిస్తాయోయ్" సంబరంగా అన్నాను శ్రీమతితో

"బాబాయ్. ఇంకా ఇలాగే కూర్చున్నారేంటి? త్వరగా డ్రెస్ ఛేంజ్ చేసుకోండి. కేక్ కటింగ్‌కి టైమైపోతోంది" అంటూ వచ్చాడో కజిన్. మా సంతానాన్ని చూసి "వీళ్ళెవరు? అడిగాడు.

"ఒరిజినల్ బంధువులు. పది నిమిషాల్లో వచ్చేస్తాం. మీరు పదండ్రా అబ్బాయ్" అతన్ని పంపేనో లేదో, "కొడుకులూ కూతుళ్ళూ తప్ప అంతా ఉన్నార్రా అన్నయ్యా"

అంటూ వచ్చాడు తమ్ముడు దిగులుగా.

"వాళ్ళనీ అద్దెకు తెచ్చుకోవాల్సింది!" పెద్దవాడన్నాడు వ్యంగ్యంగా.

"ఇష్టం లేదురా. వాళ్ళూ మీలానే ప్రవర్తిస్తే ఈ ముసలి గుండె భరించలేదురా!" బావురుమన్నాను.

తమ్ముళ్ళూ చెల్లెళ్ళూ బాబాయిలూ అత్తలూ పిల్లలూ అంతా బిలబిల మంటూ వచ్చి ఏవయ్యిందంటూ చుట్టేశారు. వారి అభిమానానికి చలించిపోయాను. ఏమీ జరగలేదని సర్దిచెప్పేక గాని వాళ్ళు వెళ్ళలేదు.

"నాటకాలు బాగా రక్తి కట్టిస్తున్నారు" పెద్దవాడు కామెంట్ చేశాడు.

"త్వరగా రండి తాతగారూ, డాన్స్ చేస్తాం చూద్దురు గాని" అన్నారు మనవలూ మనవరాళ్ళూ.

"ఇదిగో వీళ్ళని పంపి వచ్చేస్తాం. మీరు ఆ ఏర్పాట్ల మీద ఉండండి" అని చెప్పి పంపించేశాను.

"భోంచేద్దురుగాని లేవండ్రా, ఎప్పుడు తిన్నారో ఏమో" శ్రీమతి అంది.

వాళ్ళు కదల్లేదు. "ఉంటారా వెళ్తారా?" సూటిగా అడిగాను.

"ప్లీడర్ని తీసుకొచ్చాం. వీలునామా రాసేస్తే వెళ్ళిపోతాం"

"అందుకోసం వచ్చార్రా ముదనష్టపోళ్ళారా. ఫోండిరా ఫోండి...." బిగ్గరగా అరచి, నోట్లో చీరకొంగు కుక్కుకుని, లోపలికి పరుగెత్తింది శ్రీమతి.

"సంతోషం. ఇన్నేళ్ళూ మిమ్మల్ని వృద్ధిలోకి తేవటమే లక్ష్యంగా బ్రతికేం. ఇప్పుడు మరో గమ్యం ఏర్పరచుకోవాలనుకుంటున్నాం. ఇది మాత్రం కేవలం మాకోసమే. మా ఆనందం కోసమే. 'ఏదో ఇలా బతికి ఉన్నాం' అన్నట్టు గాక మా బ్రతుక్కి ఒక అర్థం పరమార్థం కల్పించుకోవాలని ఉంది. పదిమందికీ ఆధరువుగా ఆధారంగా నిలవాలనుంది. మా కష్టఫలాన్ని సద్వినియోగం చేసుకోవాలనుంది. ఆ రకంగా నలుగురికీ ఆనందం పంచి, పరమానందం పోగుజేసుకోవాలని పేరాశగా ఉంది"

"కన్నప్రేమ అక్కర్లేదుగాని కొన్నప్రేమ కావాలన్న మాట!" హేళనగా అన్నాడు పెద్దకొడుకు.

"కొన్న ప్రేమ కాదు ఆకొన్న ప్రేమ కావాలి"

"ఇవో కొత్త రకమా? వీటిని మార్కెట్లో అమ్ముతారా, అద్దెకిస్తారా?" చిన్నకూతురు ప్రశ్నించింది.

వారి మాట పట్టించుకోకుండా అన్నాను "మాకు దూరమైన అనుబంధాలూ, ఆత్మీయతలూ అన్నీ మాకు కావాలి. మా కడపటి శ్వాస వరకూ కావాలి. అందుకే పాతిక ముప్పై మంది అనాథ బాలబాలికల్ని చేరదీస్తాం. వారి నవ్వుల్తో కేరింతల్తో ఈ ఇల్లు మారుమోగేలా చేస్తాం. ఈ ఆలోచన కూడా ఇవాళే ఇదిగో వీళ్ళందర్నీ చూశాకే వచ్చింది.

మీ నైజం బయట పడ్డాక బలపడింది”

“ఇంటిని అనాధ శరణాలయం చేసేస్తారన్నమాట!”

“కాదు. అనాథల్ని సనాథలుగా చేసే ఆలయంగా మారుస్తాం. మా సంపద, ఆదాయం అన్నీ వాళ్ళకోసం వినియోగిస్తాం. దాన్ని మీరెవరూ అడ్డుకోలేరు. ఇదంతా నా స్వార్జితమే. అంతా మా ఇష్ట ప్రకారమే ఖర్చుపెడతాం”

“దానర్థం మాకు ఏమీ ఇవ్వరనేగా?” చిన్నవాడు సర్రున లేచాడు.

“మీ అందరికీ ఇళ్ళున్నాయి. కార్లున్నాయి. బ్యాంకు బ్యాలెన్సులున్నాయి. మా ఆస్తి పాస్తుల్ని మీకిచ్చినా మీకు ఎంతో ఉందని తృప్తి పడడానికి తప్ప, అదనంగా మీకు ఒరిగేదేమీ ఉండదు. మీరు రెండు ఇళ్ళల్లో పడుకోలేరు. నాలుగు చేతుల్తో తినలేరు. అసలేమీ లేని వాళ్ళకి ఒక రూఫ్, ఒక ముద్ద అన్నం, ఒక చాప ఇవ్వగలిగితే వాళ్ళు నిలదొక్కుకుంటారు. వారి బతుక్కో భరోసా చిక్కుతుంది. మా జన్మలూ ధన్యం అవుతాయి. అందుకే మా సంతానమే మాకూ మా ఆస్తికీ వారసులన్న సంప్రదాయాన్ని చెరిపేస్తాం. మా తదనంతరం మా సంపద సమాజానికి ఉపయోగపడేలా చూస్తాం. కొందరు అభాగ్యబాలలే మా వారసులు. వాళ్ళ చేతులు పట్టుకుని నడిపిస్తూ, వారి మొహాల్లో ఆనందం పూయిస్తూ మా బతుకులు నందనవనం చేసుకుంటాం. ఇన్నాళ్ళూ మాకు మీరు నలుగురే. ఇక నుంచి మేం ఎందరికో. మాకిప్పుడు స్వార్థం లేదు. మీకు స్వార్థం ఉంటే మేమేం చెయ్యలేం!” అంటూ లేచాను.

అంతా కోపోద్రిక్తులై మింగేసేలా చూస్తోంటే, స్థిర స్వరంతో అన్నాను. “ఇంకో సంగతి. మేం చనిపోయాక మా శవాలను వైద్య విద్యార్థుల ప్రయోగాల కోసం ప్రభుత్వాసుపత్రికి దానమివ్వాలని నిర్ణయించుకున్నాం. అంచేత తల కొరివి పెట్టాల్సిన శ్రమా మీకు తప్పింది. మనసుంటే వచ్చి ఈ శుభసంకల్ప దినోత్సవపు కేకు తినండి. లేదా సెలవు. గుడ్ బై!”

* * *

**(నవ్య వారపత్రిక 10-5-2017)**